క్లుప్తంగా

ఎన్నికలు పకడ్బందీగా జరిగాయి

రామగిరి(నల్లగొండ): తెలంగాణ ఎన్నికల కమిషన్ తీసుకున్న చర్యల వల్ల అసెంబ్లీ ఎన్నికలు పక్బందీగా జరిగాయని ఎలక్షన్ వాచ్ కమిటీ సభ్యుడు బొమ్మరబోయిన కేశవులు అన్నారు. శుక్రవారం ఆయన నల్లగొండ పట్టణంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఎన్నికల సిబ్బంది సమర్థవంతంగా పని చేయడం వల్లనే ప్రజలు స్వేచ్ఛగా తమ ఓటు హక్కు వినియోగించుకున్నారన్నారు. ఈ కార్యక్రమంలో మేకల శ్రీహరి, శ్రీనివాసరావు, సింగారపు మల్లయ్య, నన్నూరి లింగారెడ్డి, కట్ట శ్రీనివాస్, రవి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సహస్ర దీపాలంకరణ సేవ



కనకదుర్గ ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

హుజూర్‌నగర్ : కార్తీక మాసం సందర్భంగా హుజూర్‌నగర్‌లోని శ్రీ కనకదుర్గ దేవాలయంలో శుక్రవారం సహస్ర దీపాలంకరణ సేవ, కోటి దీపోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో పడిపూజ, స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాల పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆలయ పూజారులు, ధర్మకర్తలు, మహిళలు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత

చిట్యాల: మండలంలోని నేరడ గ్రామానికి చెందిన లారీ డ్రైవర్ మందుగుల యాదయ్య ఇటీవల అనారోగ్యానికి గురయ్యాడు. దీంతో యాదయ్య వైద్య చికిత్స ఖర్చులకుగాను ఆ గ్రామంలోని లారీ డ్రైవర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 35 మంది లారీ డ్రైవర్స్ వద్ద రూ.38 వేలు సేకరించి శుక్రవారం యాదయ్యకు అందజేశారు.

భక్తిశ్రద్ధలతో లక్ష తులసీ దళార్చన



నేరడలో శ్రీ సీతారామాంజనేయస్వామి విగ్రహాలకు చేసిన లక్ష తులసీ దళార్చన

చిట్యాల: తిరు నక్షత్రం సందర్భంగా మండలంలోని నేరడ గ్రామంలో గల శ్రీసీతారామాంజనేయస్వామి ఆలయంలో శుక్రవారం లక్ష తులసీ దళార్చన కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలోని శ్రీ సీతారామంజనేయస్వామి విగ్రహాలకు తులసీ దళాలతో ప్రత్యేక అర్చనలు, పూజలు చేశారు. పూజల్లో పాల్గొన్న భక్తులకు ఆలయ అర్చకులు పాండురంగాచార్యులు తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు రాపోలు యాదగిరి, ముషం రామస్వామి, పిల్లలమర్రి లక్ష్మయ్య, చెరుపల్లి గోవర్ధన్, గుర్రం భిక్షం, ముషం శ్రీనివాస్, పులిపాటి శ్రీనివాస్, ఆనందం వరదయ్య, శ్రీనివాస్ పాల్గొన్నారు.

కేసీఆర్ ప్రగతి భవన్ ఖాళీ చేయక తప్పదు

- కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి

మునుగోడు : ఈ అసెంబ్లీ ఎన్నికల్లో ఓటర్లు ప్రజాస్వామ్యాన్ని గెలిపించబోతున్నారని, ఇక కేసీఆర్ కుటుంబం ప్రగతి భవన్ ఖాళీ చేయక తప్పదని మునుగోడు కాంగ్రెస్ అభ్యర్థి కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి అన్నారు. మునుగోడులోని ప్రాచీన శివాలయంలో కార్తీక మాసం సందర్భంగా శుక్రవారం ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలోని పేద ప్రజల సంక్షేమం కోసం పనిచేస్తున్న కాంగ్రెస్ పార్టీ తెలంగాణ రాష్ట్రంలో అధికారంలోకి రావడం ఖాయమన్నారకు. గత పదేళ్లుగా కేసీఆర్ కుటుంబ నియంత పాలనను అంతమొందించాలనే ఆలోచనతో యువతీయువకులు, ఉద్యోగులు ఉన్నారన్నారు. వారి ఆలోచనను గురువారం జరిగిన ఎన్నికల్లో అమలుచేసి బీఆర్‌ఎస్ నాయకులను ఇంటికి పంపించే పనిచేశారన్నారు. డిసెంబర్ 4న కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటుచేసిన వెంటనే ఎన్నికల సందర్భంగా ప్రకటించిన ఆరు గ్యారంటీలను 100 రోజుల్లో అమలుచేసి తీరుతుందన్నారు. మునుగోడు నియోజకవర్గ ఓటర్లు తనకు ఓట్లు వేసినందుకు కృతజ్ఞతలు తెలిపారు.

కాంగ్రెస్ నాయకుడు అన్నెం పెద్ద అంజిరెడ్డి మృతి

కోదాడరూరల్ : కోదాడ మండల పరిధిలోని రామలక్ష్మీపురం గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకుడు అన్నెం పెద్ద అంజిరెడ్డి (55) అకాల మరణం చెందారు. శుక్రవారం తెల్లవారుజామున ఆయన శ్వాస తీసుకునేందుకు ఇబ్బంది పడుతుండగా స్థానికంగా చికిత్స అందించిన అనంతరం హైదరాబాద్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు. ఆయన మృతి పార్టీకి తీరని లోటని పలువురు కాంగ్రెస్ నాయకులు అన్నారు. శనివారం గ్రామంలో అంత్యక్రియలు నిర్వహించనున్నారు.

గెలుపుపై ఎవరి ధీమా వారిదే!

- అన్ని అంశాలను బేరీజు వేసుకుంటున్న అభ్యర్థులు
- రేపు తేలనున్న అభ్యర్థుల భవితవ్యం



మాడుగులపల్లి మండలం బొమ్మకల్ పోలింగ్ కేంద్రం వద్ద బారులుదీరిన ఓటర్లు (ఫైల్)

మిర్యాలగూడ : అసెంబ్లీ ఎన్నికల్లో గెలుపుపై ఎవరి ధీమా వారే వ్యక్తం చేస్తున్నారు. నవంబర్ 9న దాఖలు చేసిన నామినేషన్ నాటి నుంచి ఆయా ప్రధాన పార్టీల అభ్యర్థులు నియోజకవర్గంలో పెద్ద ఎత్తున ప్రచారాలు చేపట్టారు. పార్టీలో చేరికలు, ఓటర్లకు ప్రలోభాలు, జన సమీకరణ వంటి అనేక వ్యూహాలతో ఢీ అంటే ఢీ అంటూ ముందుకెళ్లారు. ఎన్నికల బరిలో 23మంది అభ్యర్థులు పోటీలో ఉన్నప్పటికీ ప్రధానంగా బీఆర్‌ఎస్, కాంగ్రెస్, సీపీఎం అభ్యర్థుల్లోనే తీవ్రంగా పోటీ నెలకొంది. ఎన్నికల్లో ఒకరికి మించి మరొకరు వేస్తున్న ఎత్తుగడలతో నియోజకవర్గంలో ఎవరు గెలుస్తారనే ఉత్కంఠ ప్రజల్లో నెలకొంది. ఎన్నికల పోలింగ్ దగ్గర పడుతున్న కొద్ది పార్టీ అభ్యర్థుల్లోనే కాకుండా ప్రజల్లో కూడా ఎన్నికల వాతావరణం వేడెక్కింది. బీఆర్‌ఎస్ అభ్యర్థి నల్లమోతు భాస్కర్‌రావు రెండు నెలల నుంచి ఎన్నికల ప్రచారంలో తలమునకలై ముందుకెళ్లారు. అయితే సీపీఎం పొత్తుల కోసం ఇటు బీఆర్‌ఎస్‌వైపు అటు కాంగ్రెస్ వైపు చూడగా ఇద్దరు హ్యాండ్ ఇవ్వడంతో చివరికి ఒంటరిగానే బరిలో దిగాల్సి వచ్చింది. ఇక కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిని నిర్ణయించడానికి కాంగ్రెస్ అధిష్టానం తీవ్ర సమాలోచన చేసింది. చివరికి సీపీఎంతో పొత్తుకు కటీఫ్ చెప్పడంతో తీవ్ర ఉత్కంఠ నడుమ సామాజికవేత్తగా పేరొందిన కాంగ్రెస్ పార్టీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ బత్తుల లక్ష్మారెడ్డి(బీఎల్‌ఆర్)కు టికెట్ వరించింది. నవంబర్ 9న నామినేషన్ వేసిన బీఎల్‌ఆర్ అప్పటి నుంచి ప్రచారంలో దూసుకెళ్లారు. ఇక ఎన్నికల పోలింగ్ దగ్గరపడుతుండే కొద్ది ప్రధాన పార్టీల అభ్యర్థులు ఓటర్లను ప్రలోభపెట్టే విధంగా వ్యూహాలు రచించారు. ఒక పార్టీ ఓటుకు రూ.1000 చొప్పున పంచితే, మరో పార్టీ అభ్యర్థి రూ.500చొప్పున పంపిణీ చేశారు. చివరికి పోలింగ్ రోజు కూడా ఓటర్లను ప్రసన్నం చేసేందుకు తమ ప్రయత్నాలు సాగించారు. ఓటర్లకు మద్యం, డబ్బులతోపాటు పట్టణంలో ఇంటికి కిలో చికెన్ చొప్పున, ఆయా తండాల్లో కిలో మటన్ చొప్పున ఇంటింటికి టోకెన్లను సైతం పంపిణీ చేయడం గమనార్హం.

ఓటింగ్ సరళిపై ఆరా..

పోలైన ఓటింగ్ శాతాన్ని బేరీజు వేసుకున్న ఆయా పార్టీల అభ్యర్థులు తమకే ఎక్కువ శాతం సానుకూలంగా ఉంటుందని అభిప్రాయపడుతున్నారు. పట్టణంలో మాకే ఎక్కువ ఓటింగ్ నమోదైందని, పలాన మండలంలో, గ్రామాల్లో మాకే ఎక్కువగా పోలింగ్ నమోదైందని వ్యక్తిగతంగా నిర్వహించుకున్న సర్వేల్లో తేలిందని పేర్కొంటున్నారు. అయితే వెలువడిన ఎగ్జిట్‌పోల్స్‌లో వచ్చిన సర్వే ప్రకారం మిర్యాలగూడలో రెండు ప్రధాన పార్టీలైన బీఆర్‌ఎస్, కాంగ్రెస్‌లో ఎవరేని అభ్యర్థి అతి స్వల్ప మెజారిటీతో గట్టెక్కే అవకాశం ఉందని తెలుపుతున్నాయి. అయితే వరుసగా రెండు సార్లు మిర్యాలగూడ ఎమ్మెల్యేగా పాలిస్తున్న నల్లమోతు భాస్కర్ రావు హ్యాట్రిక్ కొడతాడా, లేక మొదటిసారి ఎమ్మెల్యే అభ్యర్థిగా కాంగ్రెస్ పార్టీ నుంచి పోటీ చేస్తున్న బీఎల్‌ఆర్ గెలుస్తాడా లేక మూడుసార్లు ఎమ్మెల్యేగా పదవిని చేపట్టిన జూలకంటి రంగారెడ్డి మ్యాజిక్ చేసి గెలుస్తాడా అనేది రేపు వెలువడనున్న అసెంబ్లీ ఎన్నికల ఫలితాల్లో వారి భవితవ్యం తేలనుంది.

మిర్యాలగూడలో 83.49శాతం నమోదు

మిర్యాలగూడ : మిర్యాలగూడ శాసనసభకు జరిగిన ఎన్నికల్లో పోలింగ్ 83.49 శాతం నమోదైంది. నియోజకవర్గంలో 2,31,391మంది ఓటర్లు ఉండగా 1,93,185 మంది తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. అత్యధికంగా మాడుగులపల్లి మండలంలో 91.08 శాతం నమోదు కాగా, అత్యల్పంగా మిర్యాలగూడలో 80.23 శాతం పోలింగ్ నమోదైంది.

మండలం	మొత్తం ఓట్లు	పోలైన ఓట్లు	పోలింగ్ శాతం
మాడుగులపల్లి	14869	13543	91.08
వేములపల్లి	20215	18328	90.67
మిర్యాలగూడ	142676	114467	80.23
దామరచర్ల	39439	34306	86.98
అడవిదేవులపల్లి	14192	12541	88.37

దేవరకొండలో 84.49శాతం

దేవరకొండ : దేవరకొండ నియోజకవర్గ వ్యాప్తంగా 2,51,266 మంది ఓటర్లు ఉండగా 2,12,593 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. మొత్తం 84.49 శాతం ఓట్లు పోలయ్యాయి. ఇందులో 1,08,586 మంది పురుషులు ఉండగా1,03,999మంది మహిళా ఓటర్లు ఉన్నారు.ఇతరులు 8మంది ఓటును వినియోగించుకున్నారు. 2018లో జరిగిన సాధారణ ఎన్నికల్లో కంటే ప్రస్తుతం జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో కొంత మేర తక్కువ శాతం పోలింగ్ నమోదైనట్లు తెలుస్తుంది.

మండలం	మొత్తం ఓట్లు	పోలైన ఓట్లు	పోలింగ్ శాతం
చింతపల్లి	42,064	36,615	87
దేవరకొండ	55,989	45378	81.04
కొండమల్లేపల్లి	27,558	22,490	81.61
గుండ్లపల్లి	39146	33,405	85.3
నేరెడుగొమ్ము	19,290	16,893	87
చందంపేట	29,434	25,120	87
పీఏపల్లి	38,141	32,891	86.23

2018లో 85.98శాతం పోలింగ్ నమోదు కాగా ప్రస్తుతం 84.49శాతం ఓట్లు పోలయ్యాయి.

నాగార్జునసాగర్‌లో 85.79శాతం

హాలియా : నాగార్జున సాగర్ నియోజకవర్గ వ్యాప్తంగా 2,33,412 మంది ఓటర్లకుగాను 2,00235 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఇందులో పురుషులు 99557 కాగా మహిళలు 100665 మంది, ఇతరులు 13 మంది ఉన్నారు. దీంతో 85.79 శాతం పోలింగ్ నమోదు అయ్యింది. 2018 ఎన్నికల్లో నియోజకవర్గంలో 86.18 శాతం ఓటింగ్ నమోదు కాగా ఈ సారి 85.79 శాతం ఓటింగ్ నమోదైయ్యింది. ఆ ఎన్నికలతో పోల్చితే ఈ ఎన్నికల్లో కొంత మేరకు ఓటింగ్ శాతం తగ్గింది. ఓటింగ్ శాతంలో సాగర్ నియోజకవర్గంలోని మాడుగులపల్లి మండలం మొదటి స్థానంలో నిలిచింది. ఈ మండలంలో 7631 మంది ఓటర్లు ఉండగా గురువారం జరిగిన అసెంబ్లీ ఎన్నికల పోలింగ్‌లో 7081 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకొని 92.79 శాతం నమోదు చేసింది. పెద్దవూర మండలంలో 46354 మంది ఓటర్లు ఉండగా 36702 మంది మాత్రమే తమ ఓటు హక్కును వినియోగించుకొని అత్యల్పంగా 79.18 శాతం పోలింగ్ నమోదైంది.

మండలం	మొత్తం ఓట్లు	పోలైన ఓట్లు	పోలింగ్ శాతం
అనుముల	35965	30733	85.45
తిరుమలగిరి	34075	29914	87.79
త్రిపురారం	35957	31159	86.66
నిడమనూరు	35636	31055	87.15
మాడుగులపల్లి	7631	7081	92.79
పెద్దవూర	46354	36702	79.18
గుర్రంపోడు	37794	33591	88.88

‘ఈవీఎం’లలో భవితవ్యం

- గెలుపోటములపై జోరుగా చర్చ
- గతం కంటే తగ్గిన పోలింగ్ శాతం
- అభ్యర్థులు, ఓటర్లలో ఉత్కంఠ



పెద్దవూర : కొత్తగూడెం ఆదర్శ పోలింగ్ కేంద్రం వద్ద బారులుదీరిన ఓటర్లు(ఫైల్)

హాలియా : నాగార్జున సాగర్ నియోజకవర్గంలో అసెంబ్లీ ఎన్నికలు గురువారం ముగియటంతో అందరి దృష్టి ఫలితాలపై పడింది. ఈవీఎంలలో ఎమ్మెల్యే అభ్యర్థుల భవితవ్యం నిక్షిప్తమైంది. ఆదివారం రోజు కౌంటింగ్ ఫలితాలపై అభ్యర్థులతో పాటు ఓటర్లలో కూడా ఉత్కంఠ నెలకొంది. గెలుపు ఎవరిని వరిస్తుందో అంచనాలకు అందడం లేదు. గత ఎన్నికలతో పోల్చితే ఈ ఎన్నికల్లో కాస్త ఓటింగ్ శాతం తగ్గడంతో ఫలితాలు ఎలా ఉంటాయోనని అభ్యర్థులు టెన్షన్ పడుతున్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా 299 పోలింగ్ కేంద్రాల్లో ఎన్నికలు నిర్వహించారు.

ఓటింగ్ సరళిపై ఆరా..

పోలింగ్ ముగియటంతో నియోజకవర్గంలో ఎక్కడ చూసినా ఎన్నికల ఫలితాల పైనే చర్చ జరుగుతోంది. ప్రధాన రాజకీయ పార్టీలైన బీఆర్‌ఎస్, కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థులు పోలింగ్ సరళిని విశ్లేషించుకునే పనిలో నిమగ్నమైయ్యారు. పోలింగ్ బూత్‌ల వారీగా ఓట్ల లెక్కలను సేకరించే పనిలో నిమగ్నమైయ్యారు. ప్రధాన పార్టీల రాజకీయ పార్టీల అభ్యర్థులు పార్టీ ముఖ్యనాయకులు, బూత్ కన్వీనర్‌లతో సమావేశాలు ఏర్పాటు చేసుకుని ఓటింగ్ తీరుతెన్నులతో పాటు విజయావకాశాలను ఎమ్మెల్యే అభ్యర్థులు విశ్లేషించుకుంటున్నారు.

గెలుపోటములపై జోరుగా చర్చ

సాగర్ నియోజకవర్గంలో కాంగ్రెస్, బీఆర్‌ఎస్ పార్టీ అభ్యర్థుల గెలుపోటములపై జోరుగా చర్చ సాగుతోంది. నియోజకవర్గంలో జరిగిన పోలింగ్‌ను భారత్, పాకిస్తాన్ క్రికెట్ పోటీని వీక్షించిన విధానంలో ఓట్ల లెక్కింపును చూసే అవకాశాలున్నాయని సీనియర్ నాయకులు అభిప్రాయ పడుతున్నారు. కాంగ్రెస్, బీఆర్‌ఎస్ పార్టీల అభ్యర్థులకు వచ్చే ఓట్లు, మెజార్టీపై ఇప్పటికే బెట్టింగ్ చేస్తున్నట్లు సమాచారం. మిగిన వారందరూ ఓట్ల లెక్కింపు జరిగే ఆదివారం ఒకే వేదికగా ఉండి పండుగ చేసుకునేందుకు ప్రణాళికలు జరుపుతున్నట్లు తెలుస్తోంది. ఫలితంపై నియోజకవర్గ ప్రజలు అత్యంత ఆసక్తిగా ఉన్నారని సమాచారం. ఏదీ ఏమైనా ఫలితం ఎవరి వరిస్తోందో ఆదివారం వరకు వేచి చూడాలి మరి.

వెంకమ్మ మృతి కాంగ్రెస్‌కు తీరని లోటు

హుజూర్‌నగర్ : హుజూర్‌నగర్ పీఏసీఎస్ మాజీ డైరెక్టర్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ మహిళా నాయకురాలు గుండెపంగు వెంకమ్మ మృతి పార్టీకి తీరని లోటని ఐఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యరగాని నాగన్న అన్నారు. హుజూర్‌నగర్‌లో గుండెపోటుతో మృతి చెందిన వెంకమ్మ మృతదేహాన్ని శుక్రవారం కాంగ్రెస్ నాయకులు సందర్శించి పార్టీ జెండా కప్పి, పూలమాల ఉంచి శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం ఆమె కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ గల్లా వెంకటేశ్వర్లు, కౌన్సిలర్ కస్తాల శ్రవణ్‌కుమార్, నాయకులు ముక్కంటి, ముత్తయ్య, రాము, రవీందర్, రాజేష్, వీరబాబు, మార్కు తదితరులు పాల్గొన్నారు.



వెంకమ్మ మృతదేహంపై కాంగ్రెస్ జెండా కప్పుతున్న పార్టీ నాయకులు

కాంగ్రెస్ అధికారంలోకి రావడం ఖాయం



సమావేశంలో మాట్లాడుతున్న బాలునాయక్

దేవరకొండ : రాష్ట్రంలో, దేవరకొండ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని దేవరకొండ మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ అభ్యర్థి నేనావత్ బాలునాయక్ ధీమా వ్యక్తం చేశారు. శుక్రవారం దేవరకొండలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల సందర్భంగా కష్టపడి పనిచేసిన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలకు ఆయన ధన్యవాదాలు తెలిపారు. తెలంగాణ ప్రజలు కాంగ్రెస్ పార్టీని ఆశీర్వదించి ఆదరించారన్నారు. 10ఏళ్ల కేసీఆర్ పాలనపై విసుగు చెంది బీఆర్‌ఎస్ పార్టీని రాష్ట్రం నుండి పారద్రోలాలని ప్రజలు నిర్ణయించుకున్నారని తెలిపారు. ఎన్నికల్లో ప్రజల ప్రలోభాలకు లోను చేయాలని చూసినా... దేవరకొండలో ప్రజలు కాంగ్రెస్‌కు బ్రహ్మరథం పట్టారన్నారు. అధికార బలంతో బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు పలు చోట్ల కాంగ్రెస్ నాయకులపై దాడులకు పాల్పడు తున్నారని, దీనిని ఆయన ఖండిస్తున్నట్లు తెలిపారు. కోరుట్లలో కాంగ్రెస్ నాయకుడు జాల తిలక్‌రెడ్డితో పాటు మరి కొందరిపై బీఆర్‌ఎస్ నాయకులు దాడులకు పాల్పడ్డారని ఆయన తెలిపారు. పోలీసులకు ముందుగానే ఘర్షణ చోటు చేసుకునే అవకాశం ఉందని సమాచారం ఇచ్చినా పోలీసు, రెవెన్యూ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించారని ఆయన ఆరోపించారు. అధికారులు నిస్పక్షపాతంగా వ్యవహరించాలని ఆయన కోరారు.ఈ సమావేశంలో మున్సిపల్ చైర్మన్ ఆలంపల్లి నర్సింహ, ఎంపీపీ నల్లగాసు జాన్ యాదవ్, పున్న వెంకటేశ్వర్లు, శ్రీధర్‌రెడ్డి, ఎండీ యూనుస్, లెండాల మోహన్, రుక్మారెడ్డి, బిక్కు నాయక్, యుగంధ ర్‌రెడ్డి, ఆయా మండలాల కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

స్ట్రాంగ్ రూంలకు ఈవీఎంల తరలింపు



హాలియాలో ఈవీఎంలను వాహనంలో తరలిస్తున్న సిబ్బంది

హాలియా : నాగార్జునసాగర్ నియోజకవర్గంలో జరిగిన అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో గురువారం రాత్రి 8 గంటల వరకు పోలింగ్ జరగడంతో ఈవీఎంలు, వీవీ ప్యాట్‌ల తరలింపు అర్ధరాత్రి వరకు కొనసాగింది. పలు మండలాల్లో పోలింగ్ కేంద్రాల్లో వినియోగించిన ఈవీఎంలు, వీవీ ప్యాట్‌లు హాలియాలోని ఐటీఐ కళాశాలలో ఉన్న డీఆర్సీ సెంటర్‌కు తరలించి భద్రపర్చారు. హాలియాలోని డీఆర్సీ సెంటర్‌లో ఈవీఎంలు, వీవీ ప్యాట్‌లను భద్రపర్చిన అనంతరం శుక్రవారం తెల్లవారు జామున 6 గంటలకు ఎన్నికల సిబ్బంది నల్లగొండ జిల్లాలోని తిప్పర్తి మండలంలోని అనిశెట్టి దుప్పలపల్లి గోదాం వద్ద ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూంలకు తరలించారు. ఈవీఎంల తరలింపును పోలీసు, ఎన్నికల సిబ్బంది, సాగర్ అసెంబ్లీ ఎన్నికల రిటర్నింగ్ అధికారి శ్రీనివాస్ పరిశీలించారు. జిల్లాలోని అనిశెట్టి దుప్పలపల్లి గోదాం వద్ద ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూంకు ఈవీఎంలు, వీవీ ప్యాట్‌లను బందోబస్తు మధ్య వాహనాల్లో తరలించారు.

హెచ్‌ఐవీ బాధితులను చిన్నచూపు చూడొద్దు



హాలియా : ర్యాలీ నిర్వహిస్తున్న ఆల్ఫా జూనియర్, ఎంసీఎం డిగ్రీ కళాశాల విద్యార్థులు



పెద్దవూర: ఎయిడ్స్ అక్షరాలతో కూర్చున్న న్యూకిడ్స్ విద్యార్థులు

హాలియా : హెచ్‌ఐవీ బాధితుల పట్ల చిన్నచూపు చూడొద్దని ఎంసీఎం డిగ్రీ కళాశాల, ఆల్ఫా జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ మంజులత అన్నారు. ప్రపంచ ఎయిడ్స్ నివారణ దినోత్సవం సందర్భంగా ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్-1 విభాగం ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక ఆల్ఫా జూనియర్, ఎంసీఎం డిగ్రీ కళాశాల విద్యార్థులకు ఎయిడ్స్ వ్యాధిపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కళాశాల నిర్వహించిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మంజులత మాట్లాడుతూ హెచ్‌ఐవీ అనే వైరస్ ద్వారా ఎయిడ్స్ సోకుతుందన్నారు. ఎయిడ్స్ వ్యాధికి చికిత్స లేదని, నివారణ ఒక్కటే మార్గమని తెలిపారు. ప్రతి ఒక్కరూ ఈ వ్యాధిపై అవగాహన పెంచుకోవాలని విద్యార్థులకు సూచించారు. అనంతరం జువాలజీ అధ్యాపకులు కొండల్ ఎయిడ్స్ వ్యాధి ఎలా వస్తుంది, దాని నివారణ, జాగ్రత్తలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ పీఓ కుకుడాల సాయి ప్రకాష్ నేత, కళాశాల అధ్యాకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

పెద్దవూర : మండల కేంద్రంలోని న్యూకిడ్స్ పబ్లిక్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం ఎయిడ్స్ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థులు ఎయిడ్స్ అక్షర క్రమంలో, ఎయిడ్స్ సింబల్ ఆకృతిలో కూర్చున్నారు. పాఠశాల హెచ్‌ఎం ఎండీ.రషీద్ ఎయిడ్స్‌పై అవగాహన కల్పించారు.

పోలీస్ కిష్టయ్యకు నివాళి

నల్లగొండ టూటౌన్ : తెలంగాణ మలిదశ అమర వీరుడు పోలీస్ కిష్టయ్యముదిరాజ్ (పుట్టకొక్కుల కిష్టయ్య) 14వ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి శుక్రవారం నల్లగొండ పట్టణంలోని తెలంగాణ అమరవీరుల స్థూపం వద్ద తెలంగాణ ముదిరాజ్ మహాసభ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర కార్యదర్శి బోళ్ల వెంకట్‌ముదిరాజ్, కేశబోయిన శంకర్‌మదిరాజ్, అంజయ్యముదిరాజ్, వెంకటేశ్వర్లు, గంగరబోయిన నరసింహ, అంజి, శ్రీను తదితరులు పాల్గొన్నారు.



కిష్టయ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

అయ్యప్ప మాలధారులకు అన్నదానం



దాతలను సన్మానిస్తున్న మాలధారులు



త్రిపురారంలో అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న సర్పంచ్ శ్రీనివాస్ రెడ్డి

కొండమల్లేపల్లి : మండల కేంద్రంలోని స్థానిక చౌరస్తా ఉన్న శ్రీ సీతారామచంద్రమౌళీశ్వరస్వామి దేవాలయంలో శుక్రవారం ఇందిరా జైపాల్‌రెడ్డి దంపతులు అయ్యప్ప మాలాధారులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గురుస్వామి చిట్టడి ప్రభాకర్‌రెడ్డి, భూతరాజు సత్తయ్యల ఆధ్వర్యంలో ఆలయంలో అయ్యప్ప స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదాత దంపతులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో వర్గాల పాండు, తోటపల్లి కృష్ణ, అయ్యప్ప మాలాదారులు తదితరులు పాల్గొన్నారు.

సాయి బాబా ఆశ్రమంలో..

త్రిపురారం : మండల కేంద్రంలోని సాయిబాబా ఆశ్రమంలో శుక్రవారం శివ, అయ్యప్ప, ఆంజనేయ స్వామి మాలధారులకు మహాఅన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా త్రిపురారం సర్పంచ్ అనుముల శ్రీనివాస్ రెడ్డి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించి స్వాముల అన్నదానం చేశారు. కార్యక్రమంలో రాంబాబు, సుధాకర్ రెడ్డి స్వాములు తదితరులు పాల్గొన్నారు.

నిడమనూరు మండలంలో 87.15శాతం

నిడమనూరు : నాగార్జునసాగర్ అసెంబ్లీకి గురువారం నిర్వహించిన పోలింగ్‌లో మండలంలో 31,055 (87.15శాతం) ఓట్లు పోల్ అయినట్లు ఎన్నికల అధికారి జే శ్రీనివాస్ తెలిపారు. ఇందులో స్త్రీలు 15,757, పురుషులు 15,133 మంది ఓటేసిన వారిలో ఉన్నారు. పురుషుల కన్నా మహిళలు ఎక్కువ మంది ఓటింగ్‌లో పాల్గొన్నారు. మండలంలో పురుషులు (17,362), స్త్రీలు (18,272) మొత్తం 35,636 ఓట్లు ఉన్నాయి. 29గ్రామ పంచాయతీల్లో 9గ్రామాల్లో 90శాతంకు పైగా ఓట్లు నమోదు అయ్యాయి. బంటువారిగూడెంలో 516 ఓట్లకు 501(97) ఓట్లు పోలయ్యాయి. వంగాల గూడెం(90.40), మారుపాక (90.91), ఎర్రగూడెం (92.84), బంటువారిగూడెం (97), రాజన్నగూడెం (91.02), పార్వతీపురం(90.63), వడ్డెరగూడెం(93.13), వెంగన్నగూడెం(92.65)శాతం ఓట్లు నమోదు అయ్యాయి.

పెద్దవూరలో పెరిగిన పోలింగ్ శాతం

పెద్దవూర : మండలంలో గత ఉప ఎన్నిక కంటే పోలింగ్ 1.61 శాతం పెరిగింది. దివంగత ఎమ్మెల్యే నోముల నర్సింహయ్య మృతితో ఏప్రిల్17, 2021న జరిగిన నాగార్జునసాగర్ ఉప ఎన్నికలో మండలంలో 77.55శాతం పోలింగ్ నమోదైంది. కాగా సార్వత్రిక ఎన్నికలో మండలంలో మొత్తం 79.16శాతం పోలింగ్ నమోదైనట్లు అధికారులు వెల్లడించారు. ఈ ఎన్నికలో మండలంలో మొత్తం 46,354 ఓట్లు ఉండగా 36,696 ఓట్లు పోలయ్యాయి. వీటిలో పురుషులు 18, 250మంది, మహిళలు 18, 441మంది, ట్రాన్స్‌జండర్‌లు ఐదుగురు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఈ ఎన్నికలో పురుషుల కంటే 191మంది మహిళలు అధికంగా ఓటు వేశారు. గత ఉపఎన్నికలో మండలంలో 44, 783 ఓట్లు ఉండగా 34, 729 ఓట్లు పోలయ్యాయి. కాగా అత్యధికంగా 95.35శాతం తమ్మడపల్లి(బూత్ నంబర్ 52)లో పురుషులు 231 మంది, మహిళలు 240లు కలిపి మొత్తం ఓటర్లు 471 ఉండగా, 224 మంది పురుషులు, 225 మంది మహిళలు కలిపి మొత్తం 449 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. కాగా అత్యల్పంగా 42.47 శాతం విజయపురి నార్త్ పైలాన్‌కాలనీ(బూత్ నంబర్ 107)లో పోలింగ్ నమోదైంది. పురుషులు 293 మంది, మహిళలు 604 మంది ఉండగా వీటిలో 142 మంది పురుషులు, 239 మంది మహిళలు కలిపి 381 మంది మాత్రమే ఓటు హక్కును వినియోగించుకున్నారు.

తెలంగాణలో మళ్లీ బీఆర్‌ఎస్‌దే అధికారం



సమావేశంలో మాట్లాడుతున్న రవీంద్రకుమార్

దేవరకొండ : రానున్న ఎన్నికల ఫలితాల్లో రాష్ట్రంలో మళ్లీ బీఆర్‌ఎస్‌దే అధికారం అని దేవరకొండ ఎమ్మెల్యే, బీఆర్‌ఎస్ అభ్యర్థి రమావత్ రవీంద్రకుమార్ అన్నారు. శుక్రవారం దేవరకొండలోని ఆయన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. దేవరకొండ నియోజకవర్గంలో బీఆర్‌ఎస్ అత్యధిక మెజార్టీతో గెలువనుందని అన్నారు. పార్టీని ఆదరించిన ప్రజలకు, పార్టీ గెలుపునకు అహర్నిషలు కృషి చేసిన పార్టీ శ్రేణులకు ఆయన ధన్యవాదాలు తెలిపారు. ఎన్నికల ముందు ఇచ్చిన వాగ్దానాలను పూర్తి చేస్తామన్నారు. రాష్ట్రంలో కేసీఆర్ హ్యాట్రిక్ సీఎం కావడం పక్కా అన్ని ఆయన ధీమా వ్యక్తం చేశారు. చందంపేట మండలం కోరుట్లలో ప్రశాంతంగా పోలింగ్ జరుగుతుంటే కాంగ్రెస్ నాయకులు బీఆర్‌ఎస్ నాయకులతో వాగ్వాదానికి దిగి స్థానిక సర్పంచ్ మల్లారెడ్డిపై దాడికి యత్నించారని ఆరోపించారు. కాంగ్రెస్ నాయకులు దాడులకు పాల్పడుతున్నారన్నారు. ఇందుకు సంబంధించి ఇప్పటికే పోలీసు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినట్లు ఆయన తెలిపారు. ఈ సమావేశంలో పీఏపల్లి ఎంపీపీ వంగాల ప్రతాప్‌రెడ్డి, వల్లపురెడ్డి, మారుపాకల సురేష్‌గౌడ్, టీవీఎన్ రెడ్డి, అంజనేయులు, సుధీర్‌రెడ్డి, లింగారెడ్డి, శ్రీనివాస్‌యాదవ్, వెంకటేశ్వరరావు, సుభాష్‌గౌడ్, పల్లా ప్రవీణ్‌రెడ్డి, ఆయా మండలాల బీఆర్‌ఎస్ నాయకులున్నారు.

నల్లగొండ నియోజకవర్గంలో 81.50 శాతం పోలింగ్

నల్లగొండ: నల్లగొండ నియోజకవర్గంలో గురువారం జరిగిన అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ సందర్భంగా 81.50 శాతం పోలింగ్ నమోదయింది. నల్లగొండ నియోజకవర్గంలో మొత్తం 284 పోలింగ్ కేంద్రాలు ఉండగా 2,44,460 మంది ఓటర్లున్నారు. ఇందులో మహిళలు 1,24,972 మంది, పురుషులు 1,19,434 మంది ఉన్నారు. 54 మంది ట్రాన్స్‌జెండర్లు ఉన్నారు. 1,99,231 మంది ఓటర్లు ఓటు హక్కు వినియోగించుకున్నారు. 1,01,866 మంది మహిళలు, 97,328 మంది పురుషులు ఓటు హక్కు వినియోగించుకున్నారు. కాగా 37 మంది ట్రాన్స్‌జెండర్లు ఓటు హక్కు వినియోగించుకున్నారు. కనగల్ మండలంలో మొత్తం ఓటర్లు 35,674 మంది ఓటర్లుండగా అందులో 32,779 మంది ఓటు వినియోగించుకోగా 91.88 శాతం పోలింగ్ నమోదయింది. మాడ్గులపల్లి మండలంలో 7340 మంది ఓటర్లకు 6475 మంది ఓటు హక్కు వినియోగించుకోగా 88.22 శాతం పోలింగ్ నమోదయింది. నల్లగొండ మండలం, మున్సిపాలిటీలో 1,72,246 మంది ఓటర్లుండగా 1,33,771 మంది ఓటు హక్కు వినియోగించుకోగా 77.63 శాతం పోలింగ్ నమోదయింది. అదేవిధంగా తిప్పర్తి మండలంలో 29,208 మంది ఓటర్లుండగా 26,266 మంది ఓటు హక్కు వినియోగించుకోగా 89.95 శాతం నమోదయింది.